# కసి

ఈ రాత్రికి మా నాన్నను హత్య చెయ్యాలని నిర్ణయించుకున్నాను. మా గుడిసెలో పడుకొని ఎప్పుడొస్తాడా అని ఎదురుచూస్తున్నాను. రాత్రి పది గంటలు దాటింది.

మా గుడిసె పక్క చింత చెట్టు కొమ్మల్లో గుడ్లగూబ వికృతంగా అరుస్తోంది. పక్క గుడిసెలో ముసలాడు ఖంగు ఖంగు మని దగ్గుతున్నాడు. దూరంగా మరో గుడిసెలో చంటి పిల్ల గుక్కపట్టి యేడుస్తోంది. ఎలక్ట్రిక్ దీపస్తంభం దగ్గర రెండు కుక్కలు పోట్లాడుకుంటూ అదే పనిగా మొరుగుతున్నాయి. దూరంగా మెయిన్ రోడ్డు మీద కారు హారన్ చప్పుడు, రిక్షా వాళ్ళ చప్పుడు, మొదటి ఆట వదిలినట్టున్నారు. ఎక్కడా గాలి వీచటం లేదు. శరీరమంతా చెమటలు కారుతున్నాయి. నా పక్కనే తమ్ముడు, చెల్లెలు నిద్రపోతున్నారు. అమ్మ ఆసుపత్రిలో ఉంది.

యేమైనా సరే. ఈ రాత్రికి మా నాన్నను హత్య చేసి తీరాలి. అప్పుడే నా కసి చల్లారుతుంది. అప్పుడే ఈ కుటుంబం బాగుపడ్తుంది.

వస్తాడు... ఇంకాస్సేపట్లో వస్తాడు. తప్పతాగి, పడుతూ లేస్తూ, తనలో తానే యేదో గొణుక్కుంటూ వస్తాడు. దొంగలా వస్తాడు. రాగానే కుండలు వెతుకుతాడు తినటానికి యేమన్నా ఉందేమోనని. మేమంతా తిన్నాక నాన్న కోసం ప్రతిరోజు కొంత అన్నం మిగిలించేది అమ్మ. యే అర్థరాత్రో దొంగలా ఇంట్లో ప్రవేశించి, అది తిని నిద్రపోతాడు నాన్న. ఇవ్వాళ్ళ కూడా నాన్న కోసం కొంత అన్నం ఉంచాను. అది తింటాడు. చస్తాడు. మా పీడ విరగడై పోతుంది. ఇవ్వాళ్ళ నాన్న కోసం ఉంచిన అన్నంలో ఎండ్రిన్ కలిపాను. అతన్ని ఈ రాత్రి పరలోకం పంపించాలని నిర్ణయించుకున్నాక నేను వేసిన పథకం అదే. మా పక్క గుడిసెల వాళ్ళల్లో కొందరు కూరగాయలు పండిస్తారు. వాళ్ళ దగ్గర ఎండ్రిన్ డబ్బాలుంటాయి. మా గుడిసెలో కూడా కూరగాయల చెట్లు వేసామని, వాటికి పురుగు తగిలిందని అబద్ధమాడి వాళ్ళదగ్గర కొంచెం ఎండ్రిన్ సంపాదించాను. అది నాన్న కోసం ఉంచిన అన్నంలో కలిపాను. పాపం... ఆకలితో వస్తాడు. అది తింటాడు. ఛస్తాడు. అప్పుడు గాని నా గుండెలు కుదుట పడవు. అప్పుడు గాని నా కసి చల్లారదు.

ఇంతకూ మా నాన్నను చంపాలన్న నిర్ణయం ఎందుకు తీసుకున్నానో చెప్పొద్దూ?

మా నాన్న తాగుబోతు.

మా నాన్న పేకాటగాడు.

మా నాన్న సిగ్గు శరం లేనివాడు.

మా నాన్న మా సంసారాన్ని పూర్తిగా నాశనం చేశాడు.

రెక్కలు విరుచుకొని మా అమ్మా, నేనూ సంపాదించిన డబ్బులు దొంగతనంగా ఎత్తుకుపోతాడు–

మమ్మల్నందర్నీ ఆకలితో చంపుతాడు మా డబ్బు తీసుకుపోతుంటే అడ్డుపడిన అమ్మను, నన్ను చితక బాదుతాడు.

మా నాన్నకు జాలిలేదు. క్రూరుడు. మా నాన్నది రాతిగుండె.

'నువ్వు ఛస్తేగాని మేము బాగుపడం' అంది అమ్మ ఎన్నోసార్లు.

అమ్మ నాకు చదువు చెప్పించాలనుకుంది. అమ్మ ఐదారుగురి ఇళ్ళల్లో పనిమనిషిగా కుదిరింది. నెలకు 30 రూపాయల వరకు సంపాదిస్తుంది. కాని అమ్మ డబ్బు తెచ్చిన తెల్లారే

నాన్న ఆ డబ్బును మటుమాయం చేసేవాడు. అమ్మ ఎంత యేడ్చి మొత్తుకున్నా లాభం లేకపోయింది.

మాది చాలా చిన్న గుడిసె. ఆ గుడిసెలో నాన్నకు తెలియకుండా డబ్బు దాచటం సాధ్యమయేది కాదు.

మా స్వంత ఊళ్ళో ఉండగా నేను బడికి వెళ్ళేవాడిని కాని పట్నం వచ్చాక, మా ఇంటి పరిస్థితి చూసాక, నేను చదువుకోవటం సాధ్యం కాదనిపించింది. ఏదోలా అమ్మకు సహాయ పడాలనుకున్నాను. మా చుట్టుపట్ల గుడిసెల్లో ఉండే ఇద్దరు ముగ్గురు రిక్షా అన్నయ్యల సహాయంతో రిక్షా లాగటం నేర్చుకున్నాను. వాళ్ళే నాకో రిక్షా కూడా యిప్పించారు. పన్నెండు యేళ్ళయినా నిండని నేను రిక్షా లాగటం చూచి అమ్మ బావురుమంది.

మా కుటుంబం ఒకప్పుడు బాగా ఉన్న కుటుంబమేనని అమ్మ చెబుతుంది. మా నాన్న వాళ్ళ అమ్మకు వొక్కడే కొడుకు. పుట్టగానే నాన్నను పొట్టనబెట్టుకున్నాడు. వాళ్ళ అమ్మ మా నాన్నను అతి గారాబంగా పెంచింది. చిన్ననాటి నుండి ఇతడు ఎంతంటే అంత.... యేదంటే అది. చిన్ననాటినుండి నాన్నకు తాగుడు అలవాటయ్యింది. ఎవరైనా బంధువులు వచ్చినప్పుడు వాళ్ళ కోసం కల్లు సారాయి తేవటం మా యిళ్ళల్లో ఆచారం. వాటిని నాన్న నెమ్మదిగా అలవాటు చేసుకున్నాడు. మొదట్లో ముద్దు కోసం, సరదా కోసం పెద్దవాళ్ళే అవి అతనికి రుచి చూపించారు. త్వరలోనే నాన్న వాటికి బానిస అయ్యాడు. బడికి పంపించినా నాన్నకు చదువుమీద ఎన్నడూ అభిలాష లేదు. చదువు వంకతో బస్తీకి వెళ్ళాడు. బస్తీకి వెళ్ళాక నాన్నకు తాగుడే కాకుండా పేకాట కూడా అలవాటయ్యింది. పేకాట, తాగటం-24గంటలు యిదే పని. అప్పులు వందలకు వందలు దాటాయి. కొడుకు బస్తీలో నిజంగానే చదువుకుంటున్నాడని, వాళ్ళమ్మ భూమి తాకట్టు పెట్టి వేలకు వేలు అప్పులు చేసి డబ్బు పంపించింది.

మెట్రిక్‌లేషన్ పరీక్ష రెండు మూడుసార్లు తప్పాక నాన్న యింటికొచ్చాడు. అప్పుడే పెళ్ళయింది. ఒక్కడే కొడుకు, బాగా ఉన్నవాళ్ళేననే అభిప్రాయంతో అమ్మను యిచ్చారు. కాని పెళ్ళినాటికే ఆ కుటుంబం పూర్తిగా అప్పుల్లో మునిగిఉన్న సంగతి అమ్మవాళ్ళకు తెలియదు.

నాన్నకు వ్యవసాయం చేయటంగాని, చేయించుకోవటంగాని చేతకాలేదు- అప్పులు చేసి, కూర్చొని తినటానికి అలవాటుపడ్డాడు.

అమ్మ కాపురానికొచ్చాక ఐదారేళ్ళలోనే ఆ యిల్లు పూర్తిగా గుల్లయిపోయింది. అప్పుల క్రింద ఎకరం తర్వాత ఎకరం ఎగిరిపోయింది. మరో రెండు మూడేళ్ళలో మా కున్న ఐదారువేలు ఖరీదు చేసే యిల్లు కూడా అప్పుల క్రింద జప్తు అయిపోయింది. ఆ తర్వాత కొద్ది రోజులకే మా నాయనమ్మ చనిపోయింది. ఆమె చనిపోవటం నాకు బాగా జ్ఞాపకం.

నా చిన్నప్పుడు చాలా సార్లు అమ్మ నన్ను దగ్గరకు తీసుకొని గుండెలకు హత్తుకుంటూ గంటలు గంటలు యేడ్చేది. అమ్మ అలా యేడుస్తున్నప్పుడు నేనూ యేడ్చేవాడిని. అంత చిన్నప్పుడు కూడా అమ్మ యేడ్పుకి కారణం ఎవరో నాకు తెలిసింది. అమ్మ ఏడ్పుకు కారణం నాన్న అని నా చాలా చిన్నవయస్సులోనే గుర్తించాను. ఎందుకో నాన్న దుష్టుడు, క్రూరుడు- నాకు, అమ్మకు శత్రువనే అభిప్రాయం నాలో అప్పుడే స్థిరపడింది. ఆనాడే నిర్ణయించుకున్నాను, నాన్న బారి నుండి అమ్మను రక్షించి, అమ్మను సంతోషపరచాలని.

సర్వస్వం కోల్పోయాక, ఆ వూళ్ళో వుండి చేసేదేముంది? పట్నం వెడితే ఏదోఒక పని చేసుకొని బతకవచ్చని అమ్మ కెవరో సలహా యిచ్చారు. మా ఊరివాళ్ళు యిద్దరు ముగ్గురు పట్నంలో డబ్బున్నవాళ్ళ యిళ్ళల్లో పనిమనుషులుగా కుదిరి కాస్త సుఖంగానే బతుకుతున్నారని

తెలిసింది. వాళ్ళ సహాయంతోనే పట్నం చేరాము. వాళ్ళ సహాయంతోనే ఈ గుడిసెకూడా అద్దెకు సంపాదించాము.

మొదట మాతో పట్నం రావటానికి నాన్న ఒప్పుకోలేదు. కాని మేము పట్నం చేరిన నాలుగైదు రోజులకే నాన్న కూడా వచ్చి మాతో కలిసాడు. ఈ లోపల అమ్మ ఐదారు యిళ్ళల్లో పనిమనిషిగా కుదిరింది.

నాన్న పట్నంలో కూడా త్వరలోనే కొంతమంది స్నేహితులను సంపాదించాడు. వాళ్ళంతా మా గుడిసె చుట్టుపట్ల వున్న గుడిసెల్లో వుండేవాళ్ళే. అంత పేద వాళ్ళయినా వాళ్ళకు కూడా తాగుడు, పేకాట అలవాటుండటం నన్ను చాలా ఆశ్చర్యపరిచింది.

నాన్న వాళ్లతో చేరాడు. గుడిసెంతా శోధించి, ఎక్కడ నయాపైస వున్నా ఎత్తుకుపోయేవాడు. ఎక్కడా డబ్బు దొరకనప్పుడు అప్పులు చేసేవాడు. అప్పులవాళ్ళు వచ్చి అమ్మను అడిగేవాళ్ళు.

అమ్మ నాన్నను నోటికొచ్చినట్లల్లా తిట్టేది. నాన్న అమ్మను కొట్టేవాడు. అడ్డుపడబోతే నన్ను కూడా రెండు బాదేవాడు.

చాలా సార్లు మాకు తిండే ఉండేది కాదు. ఆకలితో తమ్ముడూ, చెల్లాయి ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి పడిపోయేవారు. అమ్మ వాళ్లను గుండెలకు హత్తుకొని గంటలు గంటలు కుమిలి కుమిలి ఏడ్చేది. ఏ అర్థరాత్రో, నాటుసారా తాగి ఏవో పిచ్చిపాటలు పాడుకుంటూ నాన్న వచ్చేవాడు. ఆ క్షణంలో నాన్నను చూస్తే నాకు వళ్ళుమండిపోయేది. అతన్ని ముక్కలు ముక్కలుగా నరికిపారేయాలన్నంత కసి నన్ను కాల్చివేసేది.

పట్నం వచ్చిన రెండేళ్ళ తర్వాత నేను రిక్షా లాగటం మొదలెట్టాను. నేను రిక్షా లాగటం మొదలెట్టినప్పటి నుండి మా పరిస్థితి కొంచెం మెరుగైంది. రోజుకు ఐదు రూపాయల వరకు సంపాదించేవాడిని. అయితే ఆ డబ్బు ఎప్పుడూ యింటికి తెచ్చేవాడినికాదు. వెంటనే కొట్టుకెళ్ళి బియ్యం మొదలైన తిండికి కావలసిన వస్తువులు కొనుక్కొచ్చేవాడిని.

నేను యింకో పనికూడా చేశాను. మా గుడిసె మధ్య చిన్నగుంట తవ్విదాంట్లో వో చిన్న డబ్బా పాతిపెట్టాను. ఎప్పుడైనా అమ్మ దగ్గర గాని, నా దగ్గరగాని యే మాత్రం డబ్బు మిగిలినా దాంట్లోనే వేసేవాళ్ళం. అక్కడ గుంట ఉన్నట్లు నాన్నకు తెలియకుండా మామూలుగా మీద మట్టి కప్పేసాను.

నాన్నకు ఆ డబ్బు సంగతి తెలియలేదు. డబ్బుకోసం గుడిసంతా వెతికేవాడు. నాన్నకు అప్పులిచ్చేవాళ్ళకు, సారాయి దుకాణం వాడికి గట్టిగా చెప్పాము. మా నాన్నకు నయాపైసా అప్పుయివ్వద్దని. యిచ్చినా మేము తీర్చేది లేదని. ఇది జరిగాక నాన్న కాలుగాలిన పిల్లిలా తిరుగసాగాడు. అమ్మను బతిమాలాడు. యేడ్చాడు. తాగకుండా బతకలేనన్నాడు. "బతకలేకపోతే చావు" అంది అమ్మ.

నా దగ్గరకొచ్చాడు. నన్ను బతిమాలాడు. డబ్బుంటే యివ్వమన్నాడు. తనకు పేకాటలో వస్తుందని, నా డబ్బు నాకు తిరిగి యిచ్చేస్తానని, నన్ను నమ్మించటానికి ప్రయత్నించాడు. "నయాపైసా కూడా యివ్వ" నన్నాను. "నాతోపాటు రిక్షాలాగ"మన్నాను. "నేను ఎంత గొప్ప కుటుంబంలో పుట్టాను, రిక్షాలాగుతాన్రా" అంటూ నన్ను బూతులు తిట్టాడు. అమ్మను కూడా తిట్టాడు. అమ్మను పూర్వంలా కొట్టబోయాడు. నేను అడ్డుపడ్డాను. "అమ్మ మీద ఒక్కదెబ్బ పడితే నీ ఎముకలు విరుగుతా"యని చెప్పాను. నేను చిన్నవాడిగా ఉన్నప్పుడు అమ్మను కొడ్తూంటే చూస్తూ ఊరుకునేవాడిని. కాని యీ మధ్య రిక్షాలాగుతూ కొంత సంపాదిస్తున్న నాటి నుండి నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అవసరమొస్తే నాన్ననే కొట్టగలనన్న ధైర్యం కల్గింది.

కొన్ని రోజులుగా పేకాట, తాగుడు లేకపోవడం వల్ల నాన్న పిచ్చివాడైపోయాడు. పదేపదే అమ్మ దగ్గరకొచ్చి యేడ్వడం మొదలెట్టాడు. ఉరేసుకొని ఛస్తానన్నాడు. అమ్మ యేం సంకోచం లేకుండా 'చావు' అంది. "నువ్వు ఎంత త్వరగా ఛస్తే నా పిల్లలు అంత త్వరగా బాగుపడతారంది. ఈ మాట వినటంతో నాన్న బోరున యేడ్చాడు. అమ్మ కూడా యేడ్చింది.

....... ...... ......

ఈరోజు నేను రిక్షా తీసికొని సినిమా హాలువైపు వెళ్ళాను. వెళ్ళేముందు డబ్బాలో కొంత చిల్లర వేశాను. డబ్బాలో నెల రోజులుగా వేస్తున్న చిల్లరంతా కలిపి పది రూపాయలైనా వుంటుందనుకున్నాను. ఒకటి రెండు రోజుల్లో ఆ డబ్బు తీసి అమ్మకొక చీర కొనుక్కురావాలనుకున్నాను. అమ్మకు బొత్తిగా చీరలు లేవు.

చాలా సేపటివరకు ఎవరైనా దొరుకుతారేమోనని సినిమాహాలు దగ్గర ఎదురు చూస్తున్నాను. దూరంగా మా తమ్ముడు నా కోసం పరుగుత్తెకుంటూ రావడం కనిపించింది. ఎదురుగా వెళ్ళాను.

వాడు యెగసోస్తూ, యేడుస్తూ......

"నాన్న అమ్మ తల పగలకొట్టిండు" అని చెప్పాడు. నాగుండెలు అదిరాయి. వాడిని రిక్షాలో కూర్చోపెట్టుకుని గుడిసెవైపుగా పోనిస్తూ యేం జరిగిందో చెప్పమన్నాను.

"ఎవరూ లేరు. ఇప్పుడే వస్తనని అమ్మ బజారుకుబోయింది. చెల్లె నిద్రపోతాంది. నాన్న వచ్చిండు. ఎప్పటిలా యిల్లంతా వెతికిండు. నువ్వు యిందాక డబ్బాలో పైసలు వేసినప్పుడు మట్టి సరిగా కప్పనట్టున్నవు. అందువల్ల నాన్న ఆ చోటు కనుక్కున్నడు. మట్టి తీసేసి డబ్బా బయటకు తీసిండు. నేను ఉరికిపోయి నాకు ఎదురుగా వస్తున్న అమ్మతో చెప్పిన. అమ్మా, నేను గుడిసెకు ఉరికినం. డబ్బంతా కండువాలో కుమ్మరించుకొని మూటకట్టిండు నాన్న. అమ్మ 'ఆ డబ్బు అక్కడ పెట్టు' అని అరిచింది. నాన్న వినలేదు. అమ్మ అడ్డుపడింది. ఆ కండువా గుంజుకోవడానికి ప్రయత్నించింది. నాన్న అమ్మను పక్కకు తోసిండు. కిందపడిపోయింది. అయినా లేచి నాన్న కాలు పట్టుకొని పోనివ్వలేదు. నాన్న చేతికి అక్కడే వున్న కర్ర దొరికింది. ఆ కర్రతో అమ్మ తల మీద రెండు మూడు దెబ్బలు గట్టిగా వేసిండు. అమ్మ తల పగిలిపోయింది. అంతా రక్తమే. నాన్న డబ్బు పట్టుకొని ఉడాయించేసిండు."

వాడు చెప్పటం ముగించి యేడ్వటం మొదలెట్టాడు. "అమ్మ చచ్చిపోతదా అన్నా?" అంటూ వెక్కి వెక్కి యేడ్వసాగాడు. నా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. అమ్మ చచ్చిపోతుందన్న ఊహ రావటంతో నా గుండెలు భయంతో వణికాయి.

గుడిసె చేరాము. చాలమంది మా చుట్టాలు ప్రక్కలవాళ్ళు మా గుడిసెనిండా మూగారు. లోపలకెళ్ళి అమ్మను చూశాము. రక్తపు మడుగులో అమ్మ – అమ్మకు స్పృహలేదు. అమ్మ బతుకుతుందన్న ఆశ నాలో లేదు.

"అమ్మా" అంటూ అమ్మ మీద పడి యేడ్చాను. చుట్టు ప్రక్కలవాళ్ళు నన్ను ఓదార్చి వెంటనే ఆసుపత్రికి తీసికెళ్ళమని సలహా యిచ్చారు. అమ్మను రిక్షాలో వేసికొని ఆసుపత్రికే తీసికెళ్ళాను. ఆసుపత్రిలో చేర్పించి, అమ్మగాయాలకు కట్లు కట్టించాక యింటికొచ్చాను.

అమ్మను అలా రక్తపు మడుగులో చూసినప్పుడే అనుకున్నాను, నాన్నను ఈ రోజు యమలోకం పంపించి వేయాలని. అతడు ఛస్తేగాని మేము సుఖంగా ఉండలేము. అతడు ఛస్తేగాని ఈ యింటికి పట్టిన శని వదలదు.

....... ...... .....

పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో పదకొండు గంటలు కొట్టారు.

నాన్న ఏ క్షణంలోనైనా రావచ్చని ఊపిరి బిగపట్టి ఎదురు చూస్తున్నాను.

చింతచెట్టు కొమ్మల్లో గుడ్లగూబ అలాగే అరుస్తోంది. పక్క గుడిసెలోని ముసలాడు అలాగే ఖంగు ఖంగుమని దగ్గుతున్నాడు. ఎలక్ట్రిక్ స్తంభం దగ్గర పోట్లాడుకుంటున్న కుక్కలు ఎటో పారిపోయాయి. దూరంగా చంటిపిల్ల యింకా ఏడుస్తూనే ఉంది.

ఈరోజు నాన్న రావటం చాలా ఆలస్యం అయ్యింది. రోజూ పదిగంటలవరకే వచ్చేవాడు. ఈరోజు చేతినిండా డబ్బుంది. ఇంకా సారా దుకాణంలోనే ఉండి ఉంటాడు.

నాన్నను హత్య చేస్తున్నానన్న బాధ నాలో యేకోశానాలేదు. నేను యేదో తప్పు చేస్తున్నానని కూడా నాకనిపించలేదు. అతడు చావటం మా కుటుంబానికి చాలా అవసరం. అతడు ఛస్తేగాని నేనూ, అమ్మా, తమ్ముడూ చెల్లి ఈ లోకంలో బతకలేం. అతడు వొక్కడికోసం మేము నల్గురం ప్రతిరోజూ ఆకలితో చావటం చాలా ఘోరమైన అన్యాయం కాదంటారా? గుడిసె బయట అడుగులచప్పుడు, దిగ్గునలేచి కూర్చున్నాను. వచ్చేస్తున్నాడు ఎందుకో రెండు చేతులతోను కడుపు పట్టుకున్నాడు. సరిగ్గా నడవలేకపోతున్నాడు. వంకర్లు తిరిగిపోతున్నాడు. మామూలు కంటే తాగుడు ఎక్కువై ఉంటుందనుకున్నాను. దగ్గర కొచ్చాడు. గుడిసెలో ప్రవేశిస్తూనే రెండుచేతులా కడుపు కొట్టుకుంటూ దభీమని నేల మీద విరుచుకుపడ్డాడు. నేను దగ్గరకెళ్ళి కర్కశంగా అన్నాను.

"దొరగారి కివ్వాళ్ళ తాగుడు బాగా ఎక్కువైనట్లుంది"

కడుపు కొట్టుకుంటూనే

"ఆ! తాగాను... తాగానురా.. చావటానికి తాగాను... ఛస్తున్నాను. అయ్యో... అమ్మో" భయంకరంగా కేకలు వేయసాగాడు. ఆ కేకల్లో విపరీతమైన బాధ. కడుపు కొట్టుకుంటూ నేల మీద అటూ యిటూ దొర్లసాగాడు. తల కోసేసిన కోడిలా కొట్టుకోసాగాడు. నాకు భయమేసింది. ఎందుకో నాన్న ఏ క్షణంలోనయినా చచ్చిపోవచ్చనిపించింది. నాన్న మీద జాలి కలిగింది.

"ఏమైంది నాన్న... ఏమైంది"? అన్నాను అతన్ని గట్టిగా పట్టుకుంటూ.

"చచ్చిపోతున్నానురా!... చచ్చిపోతున్నాను... మీ అమ్మేది? ఒక్కసారి నా దగ్గరకు తీసుకురావూ! మీ అమ్మకు అన్యాయం చేసిన్రా! నన్ను క్షమించదు... కాని ఒక్కసారి నాదగ్గరకు తీసుకురావూ?" చాలా దీనంగా అన్నాడు.

"అమ్మ ఇంకెక్కడుంది నాన్నా... నువ్వే కొట్టావుగా... ఆసుపత్రిలో ఉంది".

"ఔను... కొట్టాను.... నేను రాక్షసుణ్ణిరా... మీ పాలిటి యముణ్ణి. కానీ పోతున్నాను. నా పీడ విరగడైపోతుంది. ఇకనైనా హాయిగా ఉండుండ్రి..."

"ఇంతకూ ఏమైంది నాన్నా"?

"మీరు దాచిన డబ్బు తీసికపోయిన్నా... సారా దుకాణంవాడు ఆ డబ్బంతా తీసికొని నాకు ఒక్క చుక్క కూడా సారా పొయ్యలేదు. ఆ డబ్బంతా పాతబాకీ కింద చెల్లు అన్నడు. నాకు పిచ్చెక్కింది. వాడితో పోట్లాడాను. వాడి మనుషులతో బాగా తన్నించి చెత్తకుండీలో పారేయించాడు."

ఇక చెప్పలేకపోయాడు. అతని బాధ ఎక్కువయింది. దభీదభీమని చేతులతో కడుపు బాదుకోవటం మొదలెట్టాడు. - లుంగలు చుట్టుకుపోయాడు. నోట్లోంచి నురుగులు కక్కసాగాడు. మళ్ళా చెప్పసాగాడు.

"ఎండ్రిన్ తాగి(నా... ఎండ్రిన్. ఇక్కడ్నే మన గుడిసెల్లోనే కూరగాయలు పండించేవాళ్ళు లేరూ... అక్కడే సంపాదించిన... అమ్మో బాధ... చచ్చిపోతున్నా- అమ్మో! మీ అమ్మను ఒక్కసారి చూపించురా?... ఔను... లేదుగదా?...కొట్టిన... చంపిన.. అందుకే ఛస్తున్నా. నా జీవితంలో చేసిన మంచి పని ఇదొక్కటే. దౌర్భాగ్యుణ్ని! పోతున్నా... అమ్మో..."

నాన్న వెర్రిగా అరిచాడు. "ఎండ్రిన్ తాగిన" అన్న మాట వినగానే నాన్నను చంపింది నేనేననే భయం నాలో అతి వేగంగా వ్యాపించింది. నా కాళ్ళు చేతులు ఆడలేదు. నేను హంతకుణ్ణి. నన్ను పోలీసులు పట్టుకుపోతారు. లేచి పారిపోవాలి. కాని నా కాళ్ళు భూమిలో కూరుకుపోయాయి. కదలలేకపోతున్నాను. కుప్పలా కూలిపోయాను. నాన్న అలాగే వెర్రిగా అరుస్తున్నాడు. భయంకరంగా మూలుగుతున్నాడు. అటూ ఇటూ కొట్టుకొంటున్నాడు. నాన్న కేసి చూడలేకపోయాను. నేనే హంతకుణ్ణనే భయం నా గుండెల్ని నులిమివేసింది.

అకస్మాత్తుగా నాన్న మూల్గటం మానేసాడు. కొట్టుకోవటం మానేసాడు. నాన్న కాళ్ళుచేతులు చల్లబడ్డాయి. అయిపోయింది. నాన్న చచ్చిపోయాడు. "నాన్నా" అంటూ నాన్న శవం మీద పడి కుళ్ళి కుళ్ళి యేడ్చాను.

(సృజన, నవంబరు, 1969)